12న హైటెక్స్‌లో నాలుగు పారిశ్రామిక ప్రదర్శనలు ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కాషిఫ్‌రాజ్, చిత్రంలో మహ్మద్ ముదస్సర్, ఎల్.ఎన్.రావ్, సందీప్

నాంపల్లి: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సరికొత్తగా నాలుగు పారిశ్రామిక ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మీడియా డే మార్కెటింగ్(ఎండీఎం), డైరీ అండ్ ఫుడ్ ఎక్స్‌పో, ఇండియన్ గ్రీన్ ఎనర్జీ ఎక్స్‌పో, గ్రీన్ వెహికల్ ఎక్స్‌పో సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలు డిసెంబరు 12 నుంచి 14వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ఈ మేరకు మంగళవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మీడియా డే సంస్థ డైరెక్టర్లు రామ్ సొందాలకర్, మహ్మద్ ముదస్సర్, కాషిఫ్‌రాజ్, రియోటో ఎలక్ట్రిక్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ రాల్‌హాన్ కలిసి ప్రదర్శన పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా అతిథులుగా హాజరై ప్రదర్శనను ప్రారంభిస్తారని తెలిపారు. పాల ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తులు, పానీయాలు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ కోల్డ్ చైన్, కిచెన్ ఎక్విప్‌మెంట్, బేకరీ, గ్రీన్ ఎనర్జీ ఎక్విప్‌మెంట్స్, వెహికల్ ఎక్విప్‌మెంట్స్ పరికరాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు రకాల ఈవీ స్కూటర్లను ప్రదర్శించి విక్రయిస్తారని పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం



ప్రముఖులను సన్మానిస్తున్న నిర్వాహకులు

సుల్తాన్‌బజార్: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ లోయపల్లి నర్సింగ్‌రావు, డాక్టర్ మార్గం విజయ్‌పటేల్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు కె.రాములు, తెలంగాణ రాష్ట్ర మాజీ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్.రాములు, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్, తెలంగాణ హైకోర్టు న్యాయవాది రమేష్ కడారి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మానవ హక్కుల పరిరక్షణ కోసం కుల మతాలకు అతీతంగా అందరూ సమానులే అని భారత రాజ్యాంగ ఫలాలు అందరికి దక్కేలా చూడాలని చేస్తున్న న్యాయ పోరాటాలు చాలా గొప్పవన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల రవి బాబు, డాక్టర్ లోయపల్లి నర్సింగ్‌రావు, మామిడాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఐటీఎస్‌లో జాతీయ గణితశాస్త్ర దినోత్సవం



గోల్కొండ: గణిత శాస్త్రం అన్ని శాస్త్రాల కంటే భిన్నమైందని షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ గణితశాస్త్ర దినోత్సవం జరిగింది. మ్యాథ్స్ క్లబ్ యాప్టస్‌గన ఆధ్వర్యంలో ఇంటర్ కాలేజీ క్విజ్ కాంపిటీషన్ జరిగింది. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గణిత శాస్త్రం ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిందన్నారు. తమ కళాశాల ఈ పోటీలకు వేదిక కావడం ఒక గొప్ప విషయమన్నారు. ఈ పోటీల్లో మొత్తం ముగ్గురు సభ్యులు ఉన్న 67 బృందాలు వివిధ కళాశాలల నుంచి పాల్గొన్నాయని కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవీలత తెలిపారు. మ్యాథమెటికల్ అప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, బేసిక్ ఇంజినీరింగ్ తదితర అంశాలపై మూడు రౌండ్‌లలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ కె.మృదుల, డాక్టర్ వసుంధర, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కార్వాన్ సమస్యలు అసెంబ్లీలో లేవనెత్తుతా'



టోలిచౌకీ చౌరస్తా వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తి అవరసమైన నిధులు సాధించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో తాను కార్వాన్‌లోని సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించానన్నారు. నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణం, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు, గోల్కొండ ఏరియా ఆసుపత్రి నూతన బ్లాక్ నిర్మాణం తదితర విషయాలపై ప్రశ్నించానన్నారు. దీనికి ఫలితంగా గోల్కొండ ఏరియా ఆసుపత్రి నూతన బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన స్పోర్ట్స్ స్టేడియానికి కూడా స్థల సేకరణ జరుగుతుందన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు ఆలీముద్దీన్ తదితరులున్నారు.

ఇన్‌చార్జి వీసీని కలిసిన విద్యార్థి విభాగం నేతలు

నాంపల్లి: జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపాధ్యక్షుడిగా నియమితులైన టి.గంగాధర్‌కు పలువురు విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం ఆయనను మాసాబ్‌ట్యాంక్‌లోని విశ్వవిద్యాలయం ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం విద్యార్థి విభాగం నేతలు మహ్మద్ వసీం, శ్యాం చరణ్, సిద్ధిఖ్, విఘ్నేష్, దినేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



గంగాధర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న విద్యార్థులు

ప్రత్యేక పూజలు



గోల్కొండ: షేక్‌పేట్ మారుతీనగర్ కాలనీలోని విజయగణపతి, గురు దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య స్వామి, నాగదేవత అమ్మవార్ల 14వ వార్షిక మహోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మంగళవారం ఉదయం 10 గంటలకు గణపతి హోమం, 11 గంటలకు మహాక్షీరాభిషేకం, అలంకరణ, అర్చన, మంగళహారతి, తీర్థప్రసాదాల వితరణ జరిగాయి. మధ్యాహ్నం ఒంటి గంటకు అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమం, సాయంత్రం 4 గంటలకు మైసమ్మ ఆలయం నుంచి నాగదేవత ఆలయం వరకు సామూహిక బోనాలు, తొట్టెల ఊరేగింపు కార్యక్రమం జరిగింది. సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమం జరిగింది. ధర్మకర్తలు పూస బాబురావు ఆధ్వర్యంలో తోకల సాయిబాబా కౌసల్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శారదా శ్రీనివాసన్ గొప్ప కళాకారిణి



శారద శ్రీనివాసన్‌ను సన్మానిస్తున్న పరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: తనకు ఇచ్చిన అవకాశం వల్ల మహామహులైన రచయితల పాత్రలకు న్యాయం చేసే ప్రయత్నం చేశానని అలనాటి ఆకాశవాణి కళాకారిణి శారద శ్రీనివాసన్ అన్నారు. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మంగళవారం పరిణీత వాణి ప్రసంగం చేస్తూ వేల సంఖ్యలో నాటకాలు, సంగీత రూపకాలు, కార్మికుల కార్యక్రమం ముచ్చట్లు, సంస్కృత పాఠం తదితర కార్యక్రమాలు తనకు మంచి పేరు తెచ్చిపెట్టాయని చెప్పారు. గుడిపాటి వెంకటచలం రచించిన పురూరవ నాటకంలో ఊర్వశి పాత్ర ఆయనకు చాలా నచ్చిందని ఆయన కుమార్తె చెప్పడం తనకు దక్కిన గౌరవం అన్నారు. రంగస్థలానికి తాను రేడియోకి నీవు అన్న స్థానం నర్సింహరావు ప్రశంస డాక్టర్ దాశరథి రంగాచార్య పట్టుబట్టి తన చిల్లర దేవుళ్లు రేడియో నాటకంలో వేయించిన మంజరి పాత్ర బాగా పేరు తెచ్చాయన్నారు. డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావు, గుమ్మడి వెంకటేశ్వరరావులతో రేడియో నాటకాల్లో కలిసి నటించానని శారదా శ్రీనివాసం వివరించారు. ఈ కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, డాక్టర్ సిల్మా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు

గౌలిపురా: బస్తీలు, కాలనీ, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను నియంత్రించవచ్చునని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నషేమాన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 18 సీసీ కెమెరాలను ఆయన మంగళవారం భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..శాంతి భద్రతలను మెరుగుపరచడంలో, నేరాలను తగ్గించడంలో సీసీ కెమెరాలు దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ కాలనీ, బస్తీలు, వ్యాపార సముదాయాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరిగితే వెంటనే గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ బాలస్వామి మాట్లాడుతూ..సీసీ కెమెరాల ఏర్పాటుపై స్టేషన్ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. దీంతో ప్రజలు, కాలనీ, వ్యాపారస్తులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు లక్ష్మి, దామోదర్, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలక్‌నుమా యూజీసీ, ఫరూక్‌నగర్, వట్టేపల్లి, అలియాబాద్, గుంటల షా దర్గా, ఫాతిమానగర్ తదితర విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

12న ఓలేటి రంగమణి ఐదు దశాబ్దాల నాట్యారాధన వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు ఓలేటి రంగమణి ఐదు దశాబ్దాల నాట్యారాధన వేడుకలను ఈ నెల 12న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు సింహనందిని చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ ఓలేటి రేఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, కర్ణాటక సంగీత విద్వాంసులు నల్లాన్ చక్రవర్తి మూర్తి, సినీ దర్శకుడు శివ నాగేశ్వర్‌రావులతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అర్ధ శతాబ్ది నాట్యారాధనలో తొలితరం శిష్యుల నుంచి నేటి తరం వరకు వందలాది మంది పాల్గొని వివిధ నృత్యాంశాలను ప్రదర్శిస్తారని తెలియజేశారు.

నేడు విద్యాశ్రీ హైస్కూల్‌లో గీతా జయంతి

జియాగూడ: హిందూ రాష్ట్ర సేనా ఆధ్వర్యంలో ఈ నెల 11న గీతా జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు హిందూ రాష్ట్ర సేనా ప్రధాన కార్యదర్శి ఆదిత్య సిరసత్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మాట్లాడుతూ..గీతా జయంతిని పురస్కరించుకొని బుధవారం జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్‌లో ఉదయం 8:45 గంటలకు మహా హనుమాన్ చాలీసా పారాయణం సుమారు 1000 మందికి పైగా విద్యార్థులతో నిర్వహిస్తామని అలాగే భగవద్గీతా పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్ భాగ్యనగర్ సహ కార్యదర్శి విజయ గరుడా హాజరవుతున్నట్లు తెలిపారు.

గణిత ఫోరం ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్షలు



కందికొండ శ్రీనివాస్

అబిడ్స్: తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర గణిత ఫోరం అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీ బుధవారం అన్ని జిల్లా కేంద్రాల్లో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష పోటీ నిర్వహిస్తామన్నారు. తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియంలో నుంచి మండల స్థాయి, గ్రామ స్థాయిలో అర్హులైన వారే ఈ ప్రతిభా పరీక్షల్లో పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి తెలంగాణ గణిత ఫోరం తరఫున తగిన ప్రోత్సాహం కల్పిస్తామన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



జియాగూడ: గంజాయి విక్రయిస్తున్న ప్రాంతాల్లో ధూల్‌పేట్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి 2.742 కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ టీమ్ లీడర్ నంద్యాల అంజిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు వివరాలను వెల్లడించారు. ఆసిఫ్‌నగర్ కుమ్మరివాడిలో దేవేందర్ సింగ్ అనే వ్యక్తి ఇంట్లో దాడి చేసి సుమారు 1.442 గ్రాముల గంజాయి పట్టుకొని దేవేందర్‌ను అరెస్ట్ చేశారు. అలాగే 2 బైకులు, 2 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే అప్పర్ ధూల్‌పేట్‌లో సందీప్‌సింగ్ ఇంట్లో దాడి చేయగా 1.3 కిలోల గంజాయి లభించిందని తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది గోపాల్, మధు, భాస్కర్‌రెడ్డి, అజీమ్, అహ్మద్, ప్రకాష్, రాకేష్, హమీద్, కాలీద్, రాహుల్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజలు నిర్వహిస్తున్న లక్ష్మీనర్సింహస్వామి భక్త సమాజం



అయ్యప్ప స్వాములను సన్మానిస్తున్న దృశ్యం



పూజలు చేస్తున్న గోషామహల్ బీజేపీ నాయకులు ఆల పురుషోత్తమ్‌రావు

జియాగూడ: సబ్జిమండి ఉప్పర బస్తీలో లక్ష్మీనర్సింహస్వామి భక్త సమాజంలో అయ్యప్ప పడిపూజను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గోవింద్ గురుస్వామి ఆధ్వర్యంలో కన్యస్వామి వెంకటేష్ కుటుంబ సభ్యులతో పడిపూజ నిర్వహించారు. సన్నిధాన మహాగురువు స్వామి మొగిలి గోవింద్‌సాగర్, కునాల్, రాకేష్ సింగ్, శత్రుసింగ్, కార్తీక్, పేరుస్వాములు, కేమోజు శ్రీనివాస్, మధు, నగేష్, రాజు, కన్య స్వాములు సాయినందు, మల్లికార్జున్, వెంకటేష్, రిషి పాల్గొన్నారు.

మంగళ్‌హాట్‌లో..

అబిడ్స్: మంగళ్‌హాట్ జిన్సీచౌరాహిలో అయ్యప్ప భక్తులు మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీజేపీ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు పాల్గొని పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ..కేరళ ప్రభుత్వం అయ్యప్ప స్వాములకు సకల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు.

అయ్యప్ప స్వాములకు సన్మానం

గోల్కొండ: ఉప్పర్ బస్తీలోని బాలాంజనేయ స్వామి ఆలయంలో సన్నిధానం వద్ద అయ్యప్ప స్వాములకు మంగళవారం రాచకొండ అశోక్‌సాగర్, వెంకటేష్‌సాగర్ ఆధ్వర్యంలో భిక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్వాములను సన్మానించి అయ్యప్ప భక్తులు వారి ఆశీర్వాదం పొందారు. గోపిసాగర్, క్రాంతి సాగర్, దేవర శ్రీనివాస్ తదితరులున్నారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కుమార స్వామి, శివ ముదిరాజ్

నాంపల్లి: ప్రజా వీరుడు పండుగ సాయన్న వర్ధతిని మంగళవారం బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో గన్‌పార్కు వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి హాజరై సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార స్వామి మాట్లాడుతూ..పండుగ సాయన్న చేసిన పోరాటాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్ మాట్లాడుతూ..భవిష్యత్ తరాలు ఆయన చరిత్రను తెలుసుకునే ప్రయత్నాలు చేయాలన్నారు. అణగారిన వర్గాల కోసం తన జీవితం సర్వస్వాన్ని త్యాగం చేశాడని పేర్కొన్నారు.

రమణీయం.. కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: శ్రీసాయి నటరాజ అకాడమి ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ పి.రమాదేవి శిష్యురాలు మారినగంటి శ్రావ్య సంపద కూచిపూడి నాట్య రంగ ప్రవేశం మంగళవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి మాట్లాడుతూ..విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కలిగి ఉండటం ఎంతో అభినందనీయమన్నారు. గం గణపతి, మండోదరి శబదం, బ్రోచేవారెవరురా, హంసనంది థిల్లానా వంటి అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యులు డాక్టర్ ఎస్‌పి.భారతి, నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, కళామణి ఎస్.కుమార్, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలకు ఆహ్వానం



నరసింహారెడ్డిని ఆహ్వానిస్తున్న దారుషిఫా ప్రభుత్వ అంధుల పాఠశాల ఉపాధ్యాయులు

యాకుత్‌పురా: లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా జనవరి 4న పాఠశాలలో నిర్వహించే వేడుకలకు హాజరుకావాలని కోరుతూ దారుషిఫా ప్రభుత్వ అంధుల పాఠశాల ఉపాధ్యాయుల బృందం మంగళవారం రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ ఇ.వి నరసింహారెడ్డి తన కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఘనంగా నిర్వహిస్తున్న జయంతి వేడుకలకు డైరెక్టర్‌ను ఆహ్వానించామని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, మహ్మద్ జావిద్, రమాదేవి, నాగేశ్వర్‌రావు, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయుడు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలపై మంగళవారం గుడిమల్కాపూర్‌లోని శ్రీకృష్ణ భవన్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆయన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడారు. నిరుద్యోగ భృతి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులను నట్టేటముంచారన్నారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలంటూ కాంగ్రెస్ నేతలు నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాధాకృష్ణయాదవ్, జొన్నకుంటి మధుసుదన్, నామ యాదగిరి నేత, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, మురళీకృష్ణగౌడ్, సుధాకర్‌యాదవ్ తదితరులున్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఎంవీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కడియాల ప్రభాకర్‌రావు సంకలనం చేసిన శతక షట్కము పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సురభి వాణిదేవి మాట్లాడుతూ..తెలుగు సాహిత్య ప్రక్రియలో శతకం విలక్షణమైందన్నారు. ఈ కార్యక్రమంలో సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, న్యూ ఎరా విద్యా సంస్థల డైరెక్టర్ భాష్యం శ్రవణ్‌కుమార్, ఫౌండేషన్ సభ్యులు మట్టిగుంట వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర భారతీయులకు ప్రాధాన్యం ఇవ్వాలి



వేణుగోపాల్‌ను కలిసిన నిర్మల్‌కుమార్ యాదవ్

అఫ్జల్‌గంజ్: ఉత్తర భారతీయులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆల్ ఇండియా ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. తెలంగాణలో లక్షలాది మంది ఉన్న ఉత్తర భారతీయులకు కాంగ్రెస్ ప్రభుత్వం కార్పొరేషన్ పదవులు ఇవ్వాలన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్‌ను కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించడంలో ఉత్తర భారతీయులు కీలక పాత్ర పోషించారన్నారు. కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్ల సీనియార్టీ ఉన్న తనకు నామినేట్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులతో తహసీల్దార్ జ్యోతి తదితరులు

విజయనగర్‌కాలనీ: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ ఎస్.జ్యోతి అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో మంగళవారం విజయనగర్ కాలనీ ప్రభుత్వ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆసిఫ్‌నగర్ మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను తహసీల్దార్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..మండల పరిధిలోని పాఠశాల యాజమాన్యం విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించేలా తర్ఫీదును ఇవ్వాలన్నారు. కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, యోగా తదితర క్రీడల్లో పోటీలు ఉంటాయన్నారు. మంగళవారం నిర్వహించిన ఫుట్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఆరు టీమ్‌లు బాలికలు, 8 టీమ్‌లు బాలురు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ హరికృష్ణ, తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రెటరి ఎస్.గిరిధర్ రావు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్విమ్మింగ్ కోచ్ ఎ.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



రాజేష్ యాదవ్

అఫ్జల్‌గంజ్: బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని గ్రేటర్ బీజేవైఎం నాయకుడు, నగర శ్రీకృష్ణ భారతీయ యాదవ సంఘం అధ్యక్షుడు బి.రాజేష్‌యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు నరకమే చూస్తున్నారని ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. మంగళవారం తన కార్యాలయంలో రాజేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సంవత్సర కాలంలో ఏ ఒక్క డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించలేదని రాజేష్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సర కాలంలో ఎలాంటి ప్రగతి చేపట్టని కాంగ్రెస్ ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మంగళ్‌హాట్ అభివృద్ధికి ప్రత్యేక కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: మంగళ్‌హాట్ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ శశికళ కృష్ణ పేర్కొన్నారు. ఆర్కేపేట్‌లో నూతన రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మంగళ్‌హాట్ డివిజన్ నలుమూలలా ఆధునిక రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో చేపడుతున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోషామహల్ కన్వీనర్ ఎం.కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, నరహరి, సురేష్, అమర్నాథ్‌సింగ్, హరినాథ్, రాజశేఖర్, తిర్మల్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మెన్‌పై దాడి.. నలుగురి రిమాండ్

జియాగూడ: విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్‌ను గాయపరిచిన ఘటనలో నలుగురిని కుల్సుంపురా పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సునీల్, ఎస్ఐ భాస్కర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం..జియాగూడకు చెందిన రాహుల్ కుమార్ మొబైల్ దుకాణానికి నాలుగు నెలల విద్యుత్ బిల్లు బకాయి ఉంది. గత నెల 28న బకాయి బిల్లులు వసూలు చేయడానికి లైన్‌మెన్ జి.శ్రీనివాసరావు రాజ్‌కుమార్‌ను అడగగా చెల్లించకపోవడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశాడు. కొద్దిసేపటి తర్వాత రాహుల్‌కుమార్ బిల్లు ఫోన్ పే ద్వారా చెల్లించి విద్యుత్ పునరుద్ధరించాలని లైన్‌మెన్‌ను కోరారు. అక్కడకు వచ్చిన లైన్‌మెన్‌ను దుకాణంలో నిర్బంధించి రాహుల్‌కుమార్ (41), అతని స్నేహితులు మోహన్ (51), రమేష్(40), మహ్మద్ సోయాబ్(24), మరో మైనర్ బాలుడు దాడి చేశారు. ఈ దాడిలో లైన్‌మెన్ శ్రీనివాసరావు చెవికి గాయం ఏర్పడింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.